క్లుప్తంగా

విషజ్వరాలు ప్రబలకుండా చూడాలి

మిర్యాలగూడ: విషజ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజులకు ఎక్కువగా జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను గుర్తించి వైద్యాధికారులకు నివేదిక అందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశా గీతావాణి, వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

మిర్యాలగూడ అర్బన్ : గురువారం పట్టణంలోని ప్రకాశ్‌నగర గల ఆరోగ్య కేంద్రాన్ని డీహెంఅండ్‌హెచ్ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకుందుతున్న వైద్య సేవలపై ఆరా తీసిన అనంతరం ఫీవర్ సర్వే ఏ విధంగా జరుగుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీతావాణి, వైద్య సిబ్బంది మోతీలాల్, ప్రభాకర్, నిపున్ తదితరులున్నారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభం

చింతపల్లి : మండల పరిధిలోని కురంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు అండర్ 14, 17 విభాగంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పద్మాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని, ఎస్‌జీఎఫ్ మండల సాయి పోటీలను రెండు రోజులు నిర్వహించేందుకు కురంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. మండలంలోని ఆయా పాఠశాల నుండి విద్యార్థులను క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సంసిద్ధం చేయాలన్నారు.

ఏడీఏగా బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ నూతన ఏడీఏగా దేవాసింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఉండి రైతులకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి డి.సైదానాయక్, మాడుగులపల్లి ఏఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు ఎస్‌ఐగా వేమిరెడ్డి నారాయణరెడ్డి



గుర్రంపోడు : గుర్రంపోడు ఎస్‌ఐగా వేమిరెడ్డి నారాయణ రెడ్డి గురువా రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శివప్రసాద్ వీఆర్‌కు అ టాచ్ అయ్యారు. నారాయణరెడ్డి గతంలోనూ ఇక్కడ ఎస్‌ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయ అధికారి గుర్రం సరిత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు దుకాణాదారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలువురు దుకాణాదారులు తదితరులున్నారు.

రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాల ధర్నా

గుర్రంపోడు : రెండు లక్షల రుణమాఫీతో రైతులు ఆనందంగా ఉన్నారని, సాంకేతిక కారణాల వల్ల కొంత మంది రైతులకు రుణమాఫీలో జాప్యం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడులో విలేకరులు సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జాల చినసత్తయ్య యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమతం జగదీశ్వర్ రెడ్డి, నాయకులు కొత్త నాగరాజు, ఆవుల వెంకన్నపాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరసన

మిర్యాలగూడ అర్బన్ : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆరోగ్యశ్రీ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసు ఇచ్చి 17రోజులు గడుస్తున్నా ప్రభుత్వం గాని, ఆరోగ్యశ్రీ అధికారులు కానీ స్పందించకపోవడంతో నిరసనకు దిగామని చెప్పారు. చాలీచాలని వేతనాలతో 17ళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్రులు సుజాత, సుధాకర్, ఇందిరా రాణి, సాలయ్య, శేఖర్, నాగరాజు ఉన్నారు.

ఆన్‌లైన్ రాదు.. ఆఫ్‌లైన్‌దే జోరు

- బుక్ చేసుకున్నా జాడ లేని ఇసుక
- రోజుల తరబడి ఎదురుచూస్తున్న గృహ నిర్మాణదారులు
- అనుమతి లేకుండా సరఫరా చేస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి



రావులపెంట వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డంప్



రావులపెంట వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మిర్యాలగూడ : సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వెంటనే ఇసుక వినియోగదారులకు సరఫరా అయ్యేది. కాని మిర్యాలగూడలో ఆన్‌లైన్‌కి బదులు ఆఫ్‌లైన్‌లో ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. అధికారుల సహకారంతో అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమార్కులు రాజ్యమేలుతూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఇదంతా పోలీసులు, రెవెన్యూ అధికారులు కనుసనుల్లోనే జరుగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది.

నియోజకవర్గంలోని మిర్యాలగూడ, వేములపల్లి మండలాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి, తక్కెళ్లపల్లి రీచ్‌లు ఉండగా వేములపల్లి మండలంలోని రావులపెంట, కామేపల్లి ఇసుక రీచ్‌లు ఉన్నాయి. రావులపెంట రీచ్ పరిధిలో సుమారు 300ట్రిప్పుల ఇసుక కోసం గృహ నిర్మాణదారులు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా రెండు నెలల క్రితం ఇసుక బుక్ చేసుకున్న సమయంలో కొన్ని రోజులపాటు సక్రమంగా సరఫరా చేసి ఆ తరువాత వర్షాల కారణంగా ఇసుక రవాణా నిలిపివేశారు. మూసీ వాగులోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తొలుత అధికారులు చెప్పారు. అలా 20 రోజులపాటు ఇసుక సరఫరా నిలిపివేశారు. ఆ తరువాత పొలం పనులు సాగుతున్నాయని, ట్రాక్టర్లు రావడం లేదని రోజుకు వంద ట్రాక్టర్లు రావాల్సి ఉండగా కేవలం పది ట్రాక్టర్లు మాత్రమే వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు కూలీలు రావడం లేదని ఎక్కువ మొత్తం అడుగుతున్నారని అలా ఇస్తే ప్రభుత్వానికి మిగిలేది ఏం ఉండదని అందుకే సరఫరా నిలిపివేశామని చెబుతున్నారు. నెల రోజుల నుంచి ఇదే సాకు చెబుతూ ఇసుక రవాణా నిలిపివేశారు. దీంతో అధికారుల తీరు వల్ల గృహ నిర్మాణదారులు నిరాశకు గురవుతున్నారు. కానీ ఆఫ్‌లైన్‌లో ఇసుక రవాణా జోరుగా నడుస్తోంది. నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా అవుతుంది. దిన దినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో భవన నిర్మాణాలు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇసుక అవసరం కూడా పెద్ద ఎత్తున ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న అక్రమార్కులు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ రీచ్‌ల ద్వారా రోజు వందలాది ట్రాక్టర్ల ఇసుక రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్రమార్కులు ఇసుకను శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేసుకోని అత్యవసర పరిస్థితుల్లో రెట్టింపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వినియోగదారులకు ఇబ్బందులు

నిర్మాణదారులకు అవసరమైన ఇసుక కోసం ముందుగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలి. బుకింగ్ ఆధారంగా సీరియల్ ప్రకారం బుకింగ్ చేసుకున్న 3,4 రోజుల్లోపే ఇసుక వినియోగదారునికి సరఫరా కావాలి. పట్టణ పరిసర ప్రాంతాల్లో వందలాది మంది వినియోగదారులు ఇసుక కోసం నెల రోజుల క్రితమే బుకింగ్ చేసుకున్నప్పటికీ ఇసుక సరఫరా కాలేదు. ఇసుక సంబంధించిన డబ్బులు కూడా చెల్లించినప్పటికీ నెలల తరబడి ఇసుక రాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ మిర్యాలగూడ మండలంలోని రాయినిపాలెం రీచ్ నుంచి పదుల సంఖ్యలో రాత్రింభవళ్లు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రిప్పుకు ఇసుక రూ.3600 నుంచి రూ.5వేల వరకు అమ్ముకుంటున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక రాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫ్‌లైన్‌లో మాత్రం వందలాది ట్రాక్టర్లు ఇసుక రవాణా జరుగుతుండడంతో తప్పని పరిస్థితుల్లో వినియోగదారులు రెట్టింపు ధరలు చెల్లించి ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. కొందరి ఇసుక అక్రమ రవాణాదారులు ఆఫ్‌లైన్‌లో ఇసుకను శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేసి అదనపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత నష్టం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అనుమానాలు కలిగిస్తున్నాయి.

ఇసుక రీచ్‌ను మూసివేశాం

నియోజకవర్గంలోని రావులపెంట వద్ద ఉన్న రీచ్‌ను మూసివేశాం. కూలీలు అధికమొత్తంలో డిమాండ్ చేయడంతో ఆన్‌లైన్ బుకింగ్‌కు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. బుక్ చేసుకున్న కస్టమర్లకు సరఫరా చేయలేకపోతున్నాం. కలెక్టర్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటాం.

– జాకబ్, మైనింగ్, ఏడీ

బాధితులకు నష్టపరిహారం చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా : ప్రకృతి వైపరీత్యాల కారణంగా మండలంలోని తిమ్మాపురంలో ఇళ్లు ధ్వంసమైన బాధిత కుటుంబాలకు గురువారం సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులు అందజేశారు. అనుముల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా 34 మంది ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నుంచి ఒక్కో బాధిత కుటుంబానికి మంజూరైన రూ.5200 చొప్పున మొత్తం రూ.1,76,800ల నష్టపరిహారం చెక్కులు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ సలహాదారు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, ఏఎస్‌ఓ రవీందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, బానుచందర్‌రెడ్డి, పశిక రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పెద్దవూర పీహెచ్‌సీలో వైద్యసేవలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

పెద్దవూర: ప్రస్తుతం విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తాళ్లూరి పూర్ణచంద్ర అన్నారు. గురువారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాల్తీతండాకు చెందిన గిరిజన రైతులు ఏఎమ్మార్పీ డీ–8, 9 కాలువకు నీటిని విడుదల చేసినా మా వరకు రావడం లేదని, పొలాలు ఎండిపోతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారం లోగా ఏఎమ్మార్పీ మూడో మోటార్‌ను మరమ్మతులు చేయించి కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఉమాదేవి, వైద్యాధికారి నగేష్, సూపరింటెండెంట్ హఫీజ్‌ఖాన్, సూపర్‌వైజర్ సువర్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వైద్యసిబ్బంది నిర్మల, ఉమేష్, రంజిత్, మురళి ఉన్నారు.

అధికారుల సస్పెన్షన్‌కు ఆదేశాలు

పెద్దఅడిశర్లపల్లి : వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర పై అధికారులను ఆదేశించారు. గురువారం మేడారం గ్రామంలో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమ నిర్వహణను ఆయన పరిశీలించారు. మేడారం పంచాయతీ కార్యదర్శి అనూష విధులకు గైర్హాజరు కావడమే కాకుండా విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు ఆమెపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటకపోవడం, ఇచ్చిన మొక్కల నిర్దేశాన్ని పూర్తి చేయకపోవడమే గాక క్షేత్రస్థాయిలో మొక్కల గురంచి తప్పుడు సమాచారం ఇచ్చినందుకుగాను మేడారం ఫీల్డ్ పీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై, పూర్తిగా నిర్లక్ష్యం వహించిన ఏపీఓ శ్రీనివాస్‌లపై అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాని డీఆర్‌డీఓను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఓ శ్రీనివాస్ ఉన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మిర్యాలగూడ టౌన్: ఇందిరమ్మ కాలనీలో మొక్క నాటుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

హాలియా : మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. 'నాటుదాం ఒక మొక్క–అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా అనుముల మండలంలోని శ్రీనాథపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు బండారు అనిల్‌కుమార్ అధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు అనంద్‌పాల్, ఉపాధ్యక్షులు యాకుబ్, ట్రెజరీ యోహాన్, పాస్టర్లు జాన్సన్, క్రీస్తుదాసు, స్టీఫెన్, ఆనంద్, చక్రవర్తి, సుదర్శన్, జక్కర్యా, ఇస్సాక్, పాల్రాజు, దావీదు, సురేష్, సుధాకర్, మహేష్, జికెపాల్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటాలి

అడవిదేవులపల్లి : ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో మొక్క నాటాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని వైకుంఠాధామంలో 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుమీద' అనే నినాదంతో మొక్కలు నాటారు. అనంతరం కొత్త నందికొండ, ముల్కచర్ల, అడవిదేవులపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రధానంగా శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా అడవిదేవులపల్లి గ్రామ సమీపంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం, భవనంలోని గదులు తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోహసిన్‌బిన్ అహ్మద్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

వచ్చే ఏడాది నుంచి కేవీలో 11వ తరగతి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

మిర్యాలగూడ : మండలంలోని జప్తివీరప్పగూడెం శివారులోని కేంద్రియ విద్యాలయం(కేవీ)లో వచ్చే ఏడాది నుంచి 11వ తరగతి ప్రారంభించాలని పాలకవర్గ నామిని చైర్మన్ ఆర్డీఓ శ్రీనివాస్ రావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఈ ఏడాది పదోతరగతి చదువుతున్న విద్యార్థులు సీబీఎస్‌ఈ బోర్డు పరీక్ష రాస్తారని, వీరు 11వ తరగతి చేయాల్సి ఉంటుందని అందుకు వచ్చే ఏడాదినుంచి ప్రారంభించాలని నిర్ణయం జరిగిందని తెలిపారు. దానికి తగినట్లుగా మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలని విద్యాలయ చైర్మన్ కలెక్టర్, ప్రభుత్వానికి నివేధించాలని నిర్ణయించారు. సమావేశంలో కె.నానిప్రసాద్, ప్రిన్సిపాల్స్ కె.అజయ్‌కుమార్, మాదేవి, సత్యనారాయణ, రామచంద్రరావు, మహిత, నాగేందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చందంపేట : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చందంపేట మండలంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన ప్రకారం..వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఆర్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పలుగుతండాకు చెందిన జటావత్ మధు(21) హైదరాబాద్‌లో పేయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తీజ్ వేడుకల్లో భాగంగా బుధవారం చందంపేట మండలంలోని పోల్యానాయక్‌తండాలోని తన అక్క ఇంటికి వచ్చాడు. తీజ్ వేడుకల అనంతరం సోదరుడితో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇంటి నుంచి కాలి నడకన నడుచుకుంటూ వెళ్తున్న మధును గుర్తు తెలియని వాహనం గుటంపల్లి స్టేజీ వద్ద ఢీ కొనడంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఓబీసీ న్యాయవాదుల సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్ : ఇండియల్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ న్యాయవాదులు రాష్ట్ర స్థాయి సదస్సు ప్రచార పోస్టర్‌ను గురువారం స్థానిక కోర్టు వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేలాద్రి, న్యాయవాదులు లింగంపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, లింగయ్య, రాములు, పరమేష్, రాజేష్, వెంకన్న, రాములు, ఎల్లయ్య, మల్లేష్, అంజనేయులు, సైదులు, దుర్గాప్రసాద్, నాగేందర్, వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, వీరేంద్రనాయుడు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



పెద్దవూర : మాట్లాడుతున్న తహసీల్దార్ సరోజపావని

పెద్దవూర : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని మండల తహసీల్దార్ ఎస్. సరోజ పావని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లకు ఓటరు జాబితా తప్పుల సవరణలపై నిర్వహించిన ఒక్కరోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను అక్టోబర్ 18వ తేదీ నాటికి నమోదు చేయాలని సూచించారు. వీరితో పాటు 17 ఏళ్లు నిండిన భావిభారత ఓటర్ల జాబితాను సైతం తయారు చేయాలని పేర్కొన్నారు. ఫారం 7,8ల ద్వారా ఓటరు జాబితాలో తప్పొప్పులు, చేర్పులు, మార్పులను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తరి రాములు, డీఆర్‌పీ బాలునాయక్, ఏఎల్‌ఎంటీలు దేవేందర్, ఇరుమాది పాపిరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై బీఎల్‌ఓలకు శిక్షణ

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఓలకు ఎన్నికల్లో పాటించాల్సిన విధులపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు కొప్పోజు శ్రీనివాస్, కేశయ్యలు నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డుల్లో మార్పులు, చనిపోయిన ఓటర్ల గుర్తింపు తొలగింపు, వార్డుల మార్పు, పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాల కల్పనపై అవగాహన కల్పించారు. ఓటరు లిస్టుల సవరణతో పాటుగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పొప్పులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సైదులు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ, బీఎల్‌ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మిర్యాలగూడ : ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తదితరులు



హాలియా : ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్‌ఎస్ నాయకులు

మిర్యాలగూడ: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు బాస్కర్‌రావు ఆరోపించారు. గురువారం బీఆర్‌ఎస్ పిలుపుమేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కేవలం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ అందలేదని, అనేక ఆంక్షలు పెట్టి రైతన్నలను మోసం చేసిందని రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటన చేయాలని అప్పటి వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీసీఎంఎస్ వైస్‌చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, చిట్టిబాబునాయక్, వీరకొటిరెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టపల్లి సైదయ్యయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియా : రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుడా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం హాలియా పట్టణంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే భగత్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ డెరెక్టర్లు, మాజీ ఎంపీటీలు, మాజీ సర్పంచ్‌లు, మహిళలు తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయాలని రాస్తారోకో



గుర్రంపోడు : రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుర్రంపోడు : రైతులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ చాలా మంది రైతులకు ఇంకా రుణమాఫీ జరగకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పాశం గోపాల్‌రెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, వజ్జ ధనుంజయ.రాములు, అంజయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించడం లేదని ఆందోళన



రైతు వేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

డిండి : వ్యవసాయాధికారులు సమయ పాలన పాటించడం లేదని గురువారం రైతులు రైతు వేదిక వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతుల సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. గురువారం ఉదయం 11 గంటల సమయం వరకు కూడా రైతు వేదిక తాళం తీయలేదని, ప్రతిరోజు గంటల తరబడి అధికారుల కొరకు ఎదురు చూడక తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు కోరారు. ఆందోళన చేపట్టిన వారిలో సత్తయ్య, భద్యా, కుమార్, శ్రీను, రమేష్, తులసీరాం, మల్లయ్య, రాములు తదితరులున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఏఓగా విధులు నిర్వహిస్తున్న జ్యోతిని వివరణ కోరగా ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న నాగేశ్వరరావు సూర్యాపేట జిల్లాకు బదిలీ కావడంతో రెగ్యులర్ ఏఓ లేక పోవడంతో తాను ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నానని, తాను విధుల నిమిత్తం హైదరాబాద్ నుంచి రావడంతోనే రావడంతోనే విధులకు ఆలస్యమైందని ఆమె తెలిపారు.

మెనూ అమలు చేయాలి

మిర్యాలగూడ: భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. గురువారం దామరచర్ల మండలం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాలను పరిశీలించారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. పీరియడ్‌ల వారీగా పాఠ్యపుస్తకాలను సిద్ధం చేసి బోధనాభ్యసన తరగతి గదులకు హాజరుకావాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాల బొత్తలపాలెం బాలికల వసతి కేంద్రాన్ని సందర్శించారు. స్టాక్ రిజిస్టర్, వంటశాల పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ప్రత్యేక అధికారి ఎస్.అరుణ, ప్రిన్సిపాల్ హజారయ్య తదితరులు ఉన్నారు.

'వయ్యారిబామ'ను సమూలంగా నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

త్రిపురారం : వివిధ పంటల్లో చీడపీడల వ్యాప్తికి కారణమవుతూ రైతులకు నష్టం కలిగించే వయ్యారిబామ కలుపు మొక్కలను.. మొక్క దశలోనే సమూలంగా నిర్మూలించాలని జాతీయ సహాయ పరిశోధన(ఏఐసీఆర్‌పీ) సంస్థ ప్రధాన శాస్త్రవేత్త రామ్‌ప్రకాశ్, డాక్టర్ ప్రద్మజ అన్నారు. గురువారం త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్‌లో వయ్యారిభామ కలుపు మొక్కల నివారణపై జిల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పార్థీనియం కలుపు మొక్క విత్తనాలు పొరుగు దేశం నుంచి 66 సంవత్సరాల క్రితం మన దేశంలో ప్రవేశించాయన్నారు. పార్థీనియం మొక్కల వల్ల పంట దిగుబడులు గణనీయంగా తగ్గడమే కాకుండా మనుషులకు, పశువులకు శ్వాస, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. వయ్యారిభామ ఒక్క మొక్క నుంచి 25 వేల గింజలు ఉత్పత్తి అవుతాయని, పూత దశకు రాకముందే ఈ మొక్కను తొలగించాలన్నారు. వయ్యారిభామ ఆకులను తిని పెరిగే జైగోగ్రామ, బూకోలారేటా పెంకు పురుగులను హెక్టారుకు 500 నుంచి 1000 వరకు విడుదల చేయడం వల్ల వయ్యారిభామ కలుపు మొక్కలను నివారించవచ్చన్నారు. పార్థీనియం కలుపు మొక్క పూత రాకముందే భూమిలో నుంచి తొలగించి తగలబెట్టుకోవాలన్నారు. అనంతరం కేవీకేలో వివిధ పంటల్లో ఉన్న పార్థీనియం మొక్కలను రైతులకు చూపించి క్షేత్రస్థాయిలో మొక్కలను తొలగించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.